క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, తదితరులు

ముద్దనూరు : స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపట్టి ప్రజలకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలని డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్‌ఎస్)లో భాగమైన ముద్దనూరు పంచాయతీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించి, తడి, పొడి చెత్త వేరు చేయు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు, పంచాయతీ ఈవో లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు రుణాలు

ముద్దనూరు : మండలంలోని ముస్లిం మైనార్టీలకు సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు, వాటికి ఆన్‌లైన్‌ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి గురువారం ఒక పత్రికాప్రకటనలో తెలిపారు. మండలానికి మొత్తం 8 యూనిట్లు మంజూరైనట్లు, మూడు స్లాబ్‌లుగా ఈ రుణాలు మంజూరుచేయనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి స్లాబ్‌లో రూ.లక్ష వరకు రుణం పొందవచ్చని, రెండవ స్లాబ్ కింద రూ.3 లక్షల వరకు, మూడవ స్లాబ్ కింద రూ.5 లక్షల వరకు రుణం పొందవచ్చని, ఈ రుణాలకు 50 శాతం సబ్సిడీ వుంటుందని, సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

విద్యుత్ సరఫరా లేక అవస్థలు

ముద్దనూరు : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో మండలవాసులు తీవ్ర అవస్థలపాలయ్యారు. గురువారం అర్ధరాత్రి 1 గంట నుంచి తెల్లవారుజామున 5 గంటలవరకు ఏకధాటిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు ఇబ్బందుల పాలయ్యారు. వేసవి కాలంలో సుమారు 4 గంటల పైగా విద్యుత్ సరఫరా లేకపోవడంపై స్థానికులనుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఎర్రగుంట్ల మెయిన్ సప్‌లై నుండే విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



ట్యాంకర్ల నీటిని పట్టుకుంటున్న రాజీవ్‌కాలనీ వాసులు

వేంపల్లె : కొన్ని రోజులుగా స్థానిక రాజీవ్‌కాలనీలో తాగునీరు రాకపోవడంతో బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ధర్నా చేశారు. అందుకు సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు స్పందించి ఆ ప్రాంతంలో గురువారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయించారు. వేసవి కాలం కావడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి రాజీవ్‌నగర్ కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో ఆ ప్రాంత మహిళలు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి బోర్లలో మరికొన్ని పైపులను దింపి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ముద్దనూరు : వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మండలంలోని రైతులకు సబ్సిడీపై రాయితీ పనిముట్లను గురువారం పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో పవర్‌స్ప్రేయర్లు, విత్తనం గొర్లు, గుంటకలు, రోటోవేటర్లు, ట్రాక్టర్ స్ప్రేయర్లు తదితర పనిముట్లను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

ఎస్సీ రుణాల దరఖాస్తుకు గడువు పెంచాలి

కడప రూరల్ : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాలకు అందించే సబ్సిడీ రుణాల దరఖాస్తుకు గడువు పెంచాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కె శంకర్ తెలిపారు. గురువారం స్థానిక ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి రాజ్యలక్ష్మి కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి అందించే రుణాల ఆన్ లైన్ దరఖాస్తు గడువును పెంచాలన్నారు. ఈనెల 10వ తేదీతో దరఖాస్తు చేయడానికి గడువు ముగుస్తుందని తెలిపారు. పలుమార్లు సర్వర్ అంతరాయం వలన చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. అందువలన దరఖాస్తు గడువును పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ అక్రమాలపై చేతులు ఎత్తేసిన అధికారులు

- పోలీసు, రెవెన్యూశాఖలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం
- కోర్టుకు వెళ్లిన రైతులు



కల్వటాల గ్రామంలో తమభూములలో పనులు చేస్తున్నారంటూ పట్టాలు చూపుతున్న బాధిత రైతులు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలంలో సోలార్ కంపెనీలు రైతుల భూములు అక్రమించుకుని పనులు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీసం వారు సోలార్ కంపెనీ చేపట్టే పనుల వైపు కన్నెత్తి చూడటంలేదు. వారు ఎంత భూమి అక్రమించుకుని పనులు చేపట్టిన తమకు ఎలాంటి సంబంధంలేదనే విధంగా వ్యవహరిస్తున్నారు.

పాపాయపల్లెలో 250 ఎకరాల్లో...

పెద్దముడియం మండలంలోని కొండపాపాయపల్లె గ్రామంలో 224 సర్వేనంబర్‌లో 501.34 ఎకరాల భూమి(పుల్లరిభూమి) ఉంది. ఈ భూమిలో కర్నూల్, కడప జిల్లాలకు సంబంధించిన రైతులు, గొర్రెల కాపరులు ఈ కొండనే నమ్ముకుని పశువులను మెపుకుంటున్నారు. ప్రస్తుతం ఈ భూమిలో 250 ఎకరాలకు పైగా భూమిని చదును చేసుకున్నారు. గ్రామస్తులు డివిజన్ పరిధి, అధికారులతోపాటు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయిన ఎమాత్రం చర్యలు లేవు. ఈ గ్రామానికి పక్కనే ఉన్న కల్వటాల గ్రామంలో రైతులకు సంబంధించిన డికేటి పట్టా భూముల్లో రైతులకు తెలియకుండా భూముల్లో సోలార్ కోసం స్తంభాలను ఏర్పాటు చేశారు. తమ భూముల్లో ఎలా పనులు చేస్తారంటూ అడ్డుపడిన రైతులపై అక్రమ కేసులు పెట్టారు. మధుసూదనరెడ్డి అనే రైతుపై కంపెనీ ప్రతినిధులను బెదిరించి పదవేల డబ్బులు దొంగలించాడంటూ కేసు నమోదు చేశారు.



పాపాయపల్లెలో పుల్లరి భూముల్లో చదును చేసిన సోలార్ కంపెనీ

ఎటువంటి అనుమతులు లేవంటూ నివేదిక ఇచ్చిన ఎమ్మార్వో!

మండలంలో సోలార్ కంపెనీకి ఎటువంటి భూములు కేటాయించలేదని కేవలం ప్రతిపాదన పెట్టినట్లు మండల తహసీల్దార్ నివేదిక ఇచ్చారు. దీంతో పోలీసు శాఖలో కలవరం మొదలైంది. సోలార్ కంపెనీకి ఇచ్చిన భూముల్లో రైతులు అడ్డుపడుతున్నారని వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన నివేదికతో వారు ఒక్కసారిగా అవాక్కైపోయారు.

అక్రమణలపై హైకోర్టును ఆశ్రయించిన రైతులు

కొండపాపాయపల్లెలో ఉన్న 500 ఎకరాల భూమిని పుల్లరికి పూర్వం నుంచి ఉంది. ప్రస్తుతం ఈ భూమిని సోలార్ కంపెనీ ప్రతినిధులు ఎటువంటి అనుమతులు లేకుండా మొత్తం కొండను చదును చేసి పశువులకు మేతలేకుండా చేస్తున్నారని గ్రామంలోని కొంత మంది నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. పుల్లరి భూమిని సోలార్‌కు కేటాయించవద్దని పశువుల మేతకు మాత్రమే ఉపయోగించేవిధంగా హైకోర్టు స్టే ఇవ్వాలంటూ కోరినట్లు తెలుస్తోంది.

జనవాక్కు..


సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడి పిరికిపంద చర్య



సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జనంగా సోదాలు నిర్వహించడం చాలా బాధాకరం. కూటమి ప్రభుత్వ హయాంలో పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వ హయాంలో పత్రికలపైన, రిపోర్టర్లపైన, ఎడిటర్లపైన దాడులు చేయడం మంచి పద్ధతి కాదు.

– రాజు, సేహ్నిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షుడు, పులివెందుల

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. పోలీసులు కూడా కూటమి ప్రభుత్వం నాయకులకు బంట్రోతులుగా పనిచేస్తున్నారు. వారు చెప్పిందే ఆట పాడిందే పాటగా పోలీసులు పనిచేస్తున్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు సోదాలు చేయడం హేయమైన చర్య. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా న్యాయస్థానాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్, పులివెందుల

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం

కమలాపురం : మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించుటలో భాగంగా పట్టణంలోని షాదిఖాన దగ్గర, సుంకులమ్మ ఆలయం దగ్గర, మార్కెట్ యార్డు గ్రౌండ్, పాగేరు వంతెన వద్దనున్న ధోబి ఘాట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజాయి తాగడం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. అలాగే మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఎక్కడ ఇలాంటి కార్యక్రమాలు జరిగినా తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ, ఎస్‌ఐలు తెలిపారు. గురువారం ప్రజలకు దొంగతనాల పట్ల వారు అవగాహన కల్పించారు. ఈ మధ్య కాలంలో జిల్లాలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు జరిగాయన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చాలా మంది బయట నిద్రిస్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో ఉంచుకోవాలన్నారు. పొలం పనులకు, వాకింగ్‌కు, పశువులు మేపు కోవడానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ ఆభరణాలు ధరిస్తే అవి కనబడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే మీ కాలనీల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కమలాపురం ఎస్‌ఐ 91211 00532, సీఐ 91211 00529 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే స్థోమత ఉన్న వారు మీ ఇళ్లల్లో లేదా ఐదారు మంది కలసి వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ వీధుల్లో ఎవైన సంఘటనలు జరిగితే సీసీ కెమెరాల పుటేజీ ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ధోబిఘూట్ వద్ద తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్‌ఐ

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

జమ్మలమడుగు రూరల్ : మున్సిపల్ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సభా భవనంలో చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన జరుగనున్నట్లు కమిషనర్ వెంకట్రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

కొండాపురంలో రైళ్లు ఆపాలి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాలు

కొండాపురం : హైదరాబాద్, ముంబై, చెన్నై, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైళ్లను కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎంకు రైళ్లు ఆపాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో కరోనా రాకు మునపు కొండాపురం రైల్వే స్టేషన్‌ల్లో ప్రతి రైళ్లు ఆపేవాళ్లన్నారు. కరోనా నేపథ్యంలో రైళ్లు ఆపకుండా బంద్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైళ్లు ఆపకపోవడంతో సింహాంద్రిపురం, లింగాల, పులివెందుల, యల్లనూరు మండలాల నుంచి ప్రజలు ఇక్కడే రైళ్లలో ఎక్కేవారన్నారు. ప్రస్తుతం విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు ఇక్కడ రైళ్లు ఆపకపోవడంతో చాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రైళ్లు ఆపాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్స్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న రామాపురం

కమలాపురం : మండలంలోని రామాపురం క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ భూమిలో ఎక్కడాలేని విధంగా హరిహర దేవతామూర్తులు శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెలసిన రామాపురంక్షేత్రంలో ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రధాన సేవకుడు సత్యసాయినాథశర్మ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆలయంలో ప్రతి ఏటా వైశాఖ శుక్ల త్రయోదశి నుంచి వైశాఖ బహుళ విధియ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.

గురువారం ఆలయ సేవకులు చేస్తున్న ఏర్పాట్లను సత్య సాయినాథ శర్మ పర్యవేక్షించారు. బ్రహ్మత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలో విద్యుత్ వైర్లు, విద్యుత్ మీటరు ప్రమాదకరంగా పడి ఉన్నాయి. గోడకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్ కింద పడి ఉండటంతో వాటికి సంబంధించిన విద్యుత్ వైర్లు కూడా ప్రమాదకరంగా నేలపై పడి ఉన్నాయి. విద్యుత్ మీటర్‌పై రాళ్లు ఏర్పాటు చేసి అలాగే ప్రమాదకరంగా ఉంచారు. సంబంధిత అధికారులు అటువైపు, ఇటువైపు తిరుగుతూ వాటిని చూస్తున్నారే తప్ప.. వాటి గురించి పట్టించుకోలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా విద్యుత్ వైర్లతోపాటు విద్యుత్ మీటరును గోడకు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటరు, విద్యుత్ వైర్లు

ఉగ్రవాదుల స్థావరాల ధ్వంసం హర్షణీయం

పులివెందుల రూరల్ : పెహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ ద్వారా పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న స్థావరాలను ధ్వంసం చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓతూరు రసూల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆపరేషన్ ద్వారా దాదాపు 90 మంది ఉగ్రవాదులను హతమార్చడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. భారత్‌దేశం అనవసరంగా ఏ దేశంపై కూడా దాడి చేయదన్నారు. రాబోయే భావి తరాలకు ఆదర్శప్రాయంగా భారతదేశం నిలుస్తోందన్నారు.

ఆర్టీసీ బస్సును నడపండి సారూ..!

సింహాద్రిపురం : సింహాద్రిపురం నుంచి గురిజాల, బిదినంచర్ల మీదుగా వెలిదండ్లకు ఆర్టీసీ బస్సును నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఈ రూటు ఏదో మారుమూల రోడ్డు కాదు.. నిత్యం వందల మంది ప్రయాణించే రూటులో ఆర్టీసీ బస్సు నడపకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

గతంలో ఇదే రూటులో రెండు ఆర్టీసీ బస్సులు సెటిల్ సర్వీసులు నడిచేవి. కానీ ఆటోల తాకిడికి అధికారులు ఒక బస్సును నడిపేవారు. కానీ ఇప్పుడు ఏకంగా ఆ బస్సును కేవలం స్కూల్ విద్యార్థులకు మాత్రమే బస్సు నడిపేవారు. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో ఆ ఆర్టీసీ బస్సు నడపలేదు. ప్రస్తుతం ఈ రూటులో వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సిందే. ఈ ఆటోలలో వృద్ధులు, చిన్నపిల్లల అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. నిత్యం రద్దీగా ఉండే రూటులో ఆర్టీసీ బస్సు తిప్పకపోవడం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రయాణీకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ రూటులో ఆర్టీసీ బస్సును నడపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని పరిగణనలోకి తీసుకోవాలి

చక్రాయపేట : రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణం విషయంలో బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం చక్రాయపేటలో ఆయన మాట్లాడుతూ కాలజ్ఞాని బ్రహ్మంగారు విజయవాడలోని కృష్ణానది పొంగి కనక దుర్గమ్మ ముక్కుపుడకను నీళ్లు తాకుతాయన్నారు. ఇప్పటికే బ్రహ్మంగారి కాలజ్ఞానం చెప్పిన మేరకు కొన్ని విషయాలు కళ్లకు కనపడుతున్నాయని, రాజధాని విషయంలో కూడా ఒకసారి పునరాలోచించాలని ఆయన సూచించారు. వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన అమరావతిలో బ్రహ్మంగారు చెప్పినట్లు నీళ్లు పొంగి వస్తే రాజధాని ప్రాంతం మొత్తం మునిగిపోతుందనే విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేద్దాం

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖను అందరం సమన్వయంతో బలోపేతం చేద్దామని రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఏ. సురేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక మట్టి పెద్దపులి సర్కిల్‌లో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు జానమద్ది విజయభాస్కర్, శివారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు తదితరులతో కలిసి రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడో స్విట్జర్లాండ్ దేశంలో పుట్టిన ఆయన ప్రస్తుతం చాలా దేశాల్లో వ్యవస్థను స్థాపించి ఎక్కడ ఏ విపత్తు సంభవించినా మేమున్నామంటూ స్వచ్ఛందంగా సేవలందించే విధంగా సంస్థను నెలకొల్పారన్నారు. రెడ్‌క్రాస్‌కు జిల్లా కలెక్టర్ ప్రెసిడెంట్ గాను, డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ స్పెషలాఫీసర్ గాను ఉన్నారని, వీరి సహకారంతో మన మందరం కలిసి జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకొని సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడం, ప్రథమ చికిత్స పైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, రక్తదాన శిబిరాలు విరివిగా ఏర్పాటు చేసి పేదలకు అందించడం, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ లో విద్యార్థులను భాగస్వామ్యం చేసి వారి ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కోఆర్డినేటర్ కు పలు సూచనలు జారీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు రెడ్ క్రాస్ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ యశస్విని, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుధాకర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ స్వరూపారాణి, వైస్ పాట్రన్ జాలా ప్రభాకర్, సభ్యులు జేస్టాది వసంత్, విష్ణువర్ధన్, నాగ మల్లారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సురేష్‌కుమార్

మెడికల్ మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వ వైద్యశాలలలో నకిలీ ఉద్యోగులను పసిగట్టి విధుల నుంచి తొలగించాలని, అదే విధంగా ప్రైవేటు ఆసుపత్రుల మెడికల్ మాఫియాని అరికట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా వైద్యశాఖ అధికారి కార్యాలయంలోనే నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తున్న సూపర్ వైజర్‌ను నాలుగేళ్లుగా గుర్తించలేకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కేంద్రంలో కొన్ని హాస్పిటళ్లలో ల్యాబ్ టెస్టుల్లో ఒక్కో టెస్టుకు ఒక్కో అమౌంట్‌తో బోర్డులు పెట్టి మరీ డబ్బులు డిమాండ్ చేస్తూ పేద ప్రజలను పీల్చుకు తింటున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం జిల్లా వైద్య శాఖ అధికారి ప్రైవేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ లేకపోవడమే అన్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ట వేడుకలు

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయకస్వామి ఆలయంలో రెండు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం గురువారం వినాయక స్వామి విగ్రహాన్ని పురోహితులు వేద మంత్రాలతో ప్రతిష్ఠించారు. గురువారం ప్రత్యేక పూజలు, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం తెల్లవారుజామునుంచే పూజలతో ప్రారంభించి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డిలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి పురోహితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకస్వామి మూలవిరాట్

శ్రీహనుమద్ సమేత సీతారాముల విగ్రహ ప్రతిష్ట

వేంపల్లె : స్థానిక బొడ్డు రాజన్న వీధిలో శ్రీహనుమద్ సమేత సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా అర్చకులు ఉదయం ప్రాతఃకాల పూజ, విగ్రహ ప్రాణ ప్రతిష్ట, గోదర్శనం, పూర్ణాహుతి, తదితర పూజారి కార్యక్రమాలు నిర్వహించారు, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఆర్.వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఒకే రకం చీరలు ధరించి భక్తి పాటలు గావించారు. సర్పంచ్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కొత్తూరు రెడ్డయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పత్యేక అలంకరణలో శ్రీహనుమద్‌సమేత సీతారాముల ఉత్సవమూర్తులు

జీతాలు ఇచ్చేంతవరకు పారిశుద్ధ్య పనులు చేయం

వేంపల్లె : గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ స్కీం, ఎలక్ట్రిషన్ సిబ్బందికి జీతాలు ఇచ్చేంతవరకు పనులు చేసేదేలేదని సిబ్బంది భీష్మించుకూర్చొన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా మాకు జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ శ్రీనివాసులు హామీ మేరకు ఇంతవరకు పనులు చేశామని తెలిపారు. కొత్త ఈఓ నియమించి పది రోజులు కావస్తున్నా జీతాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య పనులు చేయమని తమ ఆవేదనను వెల్లబుచ్చారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి మాదని, ప్రతి నెలా నిత్యావసర సరుకులు, డ్వాక్రా కంతులు, ఎల్‌ఐసీ, కరెంటు బిల్లులు చెల్లించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ప్రతిసారి ఏదోక సాకు చెప్పుకుంటూ జీతాలు ఇవ్వకుండా మమ్మల్ని ఆవేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే ఏమి తిని బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా నిత్యావసర సరుకులు, హాస్పిటల్ ఖర్చులు పెరిగిపోతున్నాయని, అలాంటిది ఐదు నెలలుగా ఇవ్వకుంటే మా భార్య, పిల్లలను ఎలా పోషించుకోవాలంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ స్కీమ్స్ సిబ్బంది, ఎలక్ట్రిషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య, వాటర్ స్కీమ్స్ సిబ్బంది

హోం కంపోస్ట్ ప్రక్రియను అమలు చేయాలి

కమలాపురం : పట్టణ పరిధిలోని ప్రతి గృహిణి తమ ఇంటి నుంచి వచ్చే చెత్త నుంచి హోం కంపోస్ట్ ప్రక్రియను అమలు చేయాలని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలు, శానిటరీ సెక్రటరీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గృహిణి తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి తడి చెత్తను కంపోస్టింగ్ చేయడం ద్వారా హోం కంపోస్టింగ్‌ను తయారు చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువును తయారు చేసి ఇంటి పరిసర ప్రాంతాలలో పెంచే కూరగాయలు, పూల మొక్కలకు వినియోగించాలన్నారు. సహజ సిద్ధమైన హోం కంపోస్టింగ్ ద్వారా తయారైన ఎరువులతో పెరిగే మొక్కలు బలవర్థకంగా ఉంటాయన్నారు. ప్రతి గృహిణికి హోం కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించి అందరూ సహజ ఎరువులు తయారు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, సీఓలు లావణ్య, ప్రజ్యోత్, మెప్మా ఆర్‌పీలు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ పగడాల జగన్నాథ్